నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శనివారం 9 నవంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

# కురుమూర్తి స్వామికి సమురు

మరికల్, నవంబర్ 8 : మండలం నుంచి భక్తులు కురుమూర్తి స్వామికి సమర్పించేందుకు సమురు తీసుకెళ్లారు. ఉద్దాలోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని మరికల్, తీలేరు, మాధవరం, పల్లెగడ్డ, పెద్దచింతకుంట తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున సమురును తీసుకొని స్వామి సన్నిధికి వెళ్లారు. ఏటా స్వామికి సమురు తీసుకెళ్లడం ఇక్కడి ప్రజల ఆనవాయితీగా వస్తున్నది. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుజాతాశ్రీనివాసులు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కురుమూర్తికి సమురు తీసుకెళ్తున్న భక్తులు

## చిట్టా విప్పితే..
# అవినీతి కంపే!

- ఒక్కొక్కటిగా వెలుగులోకి రవీందర్ అక్రమాలు
- బదిలీలు, ప్రమోషన్లలో భారీ అవినీతి
- భార్యకు డిప్యూటేషన్ ఇచ్చిన ఘనుడు
- జిల్లాలోని కేజీబీవీలను సైతం వదలని వైనం
- పలు ప్రైవేట్ స్కూళ్లల్లోనూ భాగస్వామిగా..
- లంచాలు తీసుకోవడం తప్పేంకాదంటూ సమర్థింపు
- పూర్తి స్థాయిలో విచారించాలని విద్యార్థి సంఘాల డిమాండ్

మహబూబ్‌నగర్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాలమూరు విద్యా శాఖలో అవినీతి తిమింగలం లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధికారులకు లంచమిచ్చి తమ కర్తవ్యాన్ని గాలికొదిలేస్తున్నారు. ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి కొందరు ఉపాధ్యాయలు, సంఘాల నేతలే విద్యాశాఖలో భారీ ఎత్తున అవినీతికి రాచమార్గం చూపించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమోషన్లు కావాలని.. సీనియారిటీ రావాలని.. కోరిన చోట ఉద్యోగం చేయాలని.. డిప్యూటేషన్‌పై పట్టణాల్లో పనిచేయాలని.. స్కూలుకు డుమ్మా కొట్టినా అడగొద్దని.. ఇలా ఉపాధ్యాయులు అవినీతి అధికారులకు ఆమ్యామ్యాలు ఇచ్చి విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారన్న ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లోనూ భారీ ఎత్తున అవినీతి పాల్పడ్డారు. నచ్చిన ప్లేస్‌కు రూ.లక్ష దాకా లంచమిచ్చి కోరిన చోటకు జాబ్ వేయించుకున్నట్లు సమాచారం.


### ఒక్కో పనికి ఒక్కో రేటు..

మహబూబ్‌గర్ ఇన్‌చార్జి డీఈవోగా పనిచేసిన రవీందర్ అవినీతి, అక్రమాలు అన్నీ ఇన్ని కావు. ప్రమోషన్లు కావాలంటే రూ.2 లక్షలు, డిప్యూటేషన్ కావాలంటే రూ.లక్ష, సీనియారిటీ జాబితాలో రావాలంటే రూ.1.50 లక్షలు, స్కూలుకు రాకుండా డుమ్మా కొట్టిన టీచర్లు రూ.15,000, కేజీబీవీ స్కూళ్లలో చేయకుండా ఉండడానికి ఒక్కో స్కూల్ నుంచి రూ.10,000 ఇలా చెప్పుకుంటూపోతే చాంతాడంత లిస్టు బయటపడింది. జిల్లా కేంద్రంలోని డైట్ కాలేజీలో లెక్చరర్‌గా ప్రమోషన్ తీసుకొని ఏకంగా డీఈవోగా చలామణి అవుతున్నారు రవీందర్.. ఆయన అవినీతి చిట్టా ఏసీబీ అధికారులకు దొరికిపోయిందని తెలుస్తోంది. డీఈవో ఇంటిపై దాడి చేసిన సమయంలో కీలక డాక్యుమెంట్లు లభించాయని.. ఇందులో లంచాలు ఇచ్చిన వారందరి పేర్లు.. వివరాలన్నీ ఉన్నట్లు సమాచారం. దీన్ని ఏసీబీ అధికారులు గోప్యంగా ఉంచారు. ఈ సమాచారం మొత్తం ఉన్నతాధికారులకు చేరవేస్తుడటంతో ఉపాధ్యాయుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తన భార్యకు ఇంటి సమీపంలోని ఒక స్కూల్లో డిప్యూటేషన్ ఇచ్చినట్లు తేలింది. ప్రైవేటు పాఠశాలలను తన గుప్పిట్లో పెట్టుకుని ఏకంగా మూడు పాఠశాలల్లో పార్ట్‌నర్‌షిప్ ఉన్నట్లు విచారణలో బయటపడింది. ఒకప్పుడు మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యా వ్యవస్థ రాష్ట్రానికి ఆదర్శంగా ఉండేది. అలాంటిది ప్రస్తుతం అవినీతి మయంగామారింది. తమకు నచ్చినట్లు ఉండే అధికారులను మచ్చిక చేసుకుని లంచాలు ఇస్తుండడంతో ఇలాంటి తిమింగలాలు రెచ్చిపోతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు మహబూబ్‌నగర్ విద్యా శాఖను ప్రక్షాళన చేయకపోతే విద్యార్థుల భవిష్యత్‌కు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల తీరు వివాదాస్పదంగా మారుతోంది. చాలా చోట్ల సరైన సమయానికి బడులు నడవడం లేదు. ఈ విషయం మీడియాలో వచ్చినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇందుకు కారణంగా ఇలాంటి అవినీతి అధికారే అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### బదిలీల్లో భారీ అక్రమాలు

ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఈ అధికారిని ప్రసన్నం చేసుకున్న టీచర్లు నచ్చిన స్థానానికి వెళ్లడానికి ఏకంగా రూ.లక్ష చెల్లించినట్లు బయటపడింది. దీనిపై విచారణ జరిపితే పూర్తి స్థాయిలో వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని కొందరు పేర్కొంటున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నా.. నచ్చిన ప్లేస్‌కు పంపకుండా కావాలనే ఇబ్బందుల పాలు చేశారని పలువురు వాపోయారు. కేసీఆర్ ప్రభుత్వంలో డిప్యూటేషన్లను రద్దు చేశారు. అత్యవసరమైతే తప్పా ఇవ్వొద్దని.. అది కూడా కలెక్టర్ల అనుమతి ఉంటేనే అని ఆదేశాలున్నా.. వీటిని డీఈవో తుంగలో తొక్కి అంతా తానై నడిపించారు. డిప్యూటేషన్లపై ఉన్న అందరినీ విచారిస్తే అసలు విషయం బయటపడే అవకాశం లేకపోలేదు. తన భార్యకు డిప్యూటేషన్ ఇవ్వకుంటే ఏమనుకుంటారో అన్న ఉద్దేశంతో.. ఏకంగా ఇంటికి సమీపంలోని పాఠశాలకు మార్చడం గమనార్హం.

### కవర్‌తో వెళ్లాల్సిందే!



డీఈవోగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రవీందర్ తీరు వివాదాస్పదంగానే ఉన్నది. కానీ ఈ పదవిలోకి రావడానికి అధికారులకు లంచం ఇచ్చి వచ్చానని.. తాను తీసుకుంటే తప్పేంటని ఇంటికి వచ్చిన ప్రతి ఉపాధ్యాయుడి ముందు వాపోయేవాడట. ఇదే అదనుగా ఉపాధ్యాయ సంఘాలు, ఆఫీసులో పనిచేసే కొంతమంది సిబ్బంది ఆయనకు పూర్తిస్థాయిలో సహకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ పని కావాలన్నా సదరు టీచర్ అధికారి ఇంటికి కవర్‌తో వెళ్తే.. చాలు అక్కడి నుంచే ఆఫీస్ ఇబ్బందికి ఆదేశాలు వెళ్లేవట. ఫైల్ టేబుల్ మీద ఉండేదట.. ఏం తెలియనట్లు ఆర్డర్ తీసుకొని వెళ్లాల్సిందే. తీసుకున్న డబ్బులకు ఈ రకంగా న్యాయం చేస్తుండడంతో ప్రతి రోజు ఆయన ఇంటి ముందు ఎందరో ప్రత్యక్షమయ్యేవారట. స్కూల్‌కు డుమ్మా కొట్టి మరీ పని చేయించుకొని వెళ్లేవారట.

### రూ.50 వేల అడ్డంగా..

ఓ స్కూల్ టీచర్‌కు ప్రమోషన్ రాలేదు. తనకన్నా జూనియర్‌కు ప్రమోషన్ రావడంతో సదరు టీచర్ డీఈవోను కలిసింది. దానికి ససేమెరా అనగా.. చివరకు రూ.2 లక్షలకు బేరం కుదిరింది. రూ.1.50 లక్షలు ఆ టీచర్ తన ఇంటికి పిలిపించి ఇవ్వగా.. సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. అయితే సదరు టీచర్‌ను కోర్టుకు వెళ్లమని సలహా ఇచ్చి అక్కడి నుంచి ఆర్డర్ తీసుకోవాల్సిన డబ్బులు ఇవ్వందే పనిచేయలేదు. అయితే కార్యాలయ సూపరింటెండెంట్‌కు పురమాయించి ఈ ఫైల్ మొత్తం రెడీ చేశారు. కానీ సంతకం మాత్రం డబ్బులిస్తేనే పెడతానని చెప్పడంతో సదరు టీచర్ ఏసీబీని ఆశ్రయించింది. వారి సూచన మేరకు గురువారం ఉదయం ఇంటికెళ్లి రూ.50 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన ఏసీబీ అధికారులు సంబంధిత ఫైల్‌ను తెప్పించారు. అంతా రెడీ చేశాక సంతకం ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తే సమాధానం రాలేదు.

### ప్రైవేట్ స్కూళ్లల్లో భాగస్వామిగా..

జిల్లా కేంద్రంలోని ప్రముఖ పాఠశాలలో కూడా డీఈవో భాగస్వామిగా ఉన్నట్లు తెలుస్తోంది. కొన్నేళ్లుగా ఇక్కడే తిష్టవేసి ప్రతి అధికారిని తన కనుసన్నల్లో పెట్టుకుని.. అంతా ఆయన చేతుల్లోనే నడిపే వారని సమాచారం. ఫిర్యాదులు వచ్చినా చర్యలు మాత్రం శూన్యం. దీన్ని ఆసరాగా చేసుకొని ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకుగానూ నజరానాగా స్కూల్ యాజమాన్యం పార్ట్‌నర్‌షిప్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో మూడు, నాలుగు పాఠశాలల్లో భాగస్వామిగా ఉన్నట్లు ఉపాధ్యాయ వర్గాలే అంటున్నాయి. పలు ప్రైవేట్ పాఠశాలలు ఆయన అండ చూసుకొని రెచ్చిపోయినట్లు ఆరోపణలున్నాయి. భారీగా ఫీజుల వసూలు, వసతులు కల్పించకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ వంటి ఫిర్యాదులు అందినా బుట్టదాఖలుగా మారాయి. కలెక్టర్ చొరవ తీసుకొని డిప్యూటేషన్లు రద్దుచేసి బదిలీల్లోని అవినీతి, అక్రమాలను వెలికితీయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.


ఉద్దాల వేడుకలకు భారీగా హాజరైన భక్తజనం




దాసంగాలను సిద్ధం చేస్తున్న మహిళలు


భక్తులకు దర్శనమిస్తున్న ఉద్దాలు


శివసత్తుల పూనకాలు

# జనగిరులు

- వైభవంగా కురుమూర్తి ఉద్దాలోత్సవం
- అమ్మాపూర్ వద్ద పులకించిన కాంచనగుహ
- పాదుకలు స్పృశించి భక్తుల పునీతం
- మార్మోగిన గోవింద నామస్మరణ

దేవరకద్ర రూరల్ (చిన్నచింతకుంట), నవంబర్ 8 : అప్పంపల్లి నుంచి అమ్మాపూర్ వరకు జన జాతరే.. ఊకచెట్టు వాగు భక్తజనసంద్రమైంది.. దారిపొడవునా కురుమూర్తి రాయుడి పాదుకలు (ఉద్దాలు) తాకి భక్తులు పరవశించిపోయారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. శుక్రవారం సాయంత్రం కురుమూర్తి ఉద్దాల వేడుక అంగరంగ వైభవంగా సాగింది. ఏడుకొండలు అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి నామస్మరణతో మార్మోగాయి. పల్లమర్రిలో చాటకు ముందుగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పూజలు చేయగా.. అక్కడి నుంచి భక్తుల సందడి.. మేళతాళాల మధ్య ఊరేగింపుగా చిన్నవడ్డెమాన్‌లోని ఉద్దాల మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ఆచారం ప్రకారం వంశ పారంపరంగా ఉద్దాలు తయారు చేసిన స్థానిక దళిత సోదరులతో కలిసి ఎమ్మెల్యేలు జీఎమ్మార్, వాకిటి శ్రీహరి, ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి మదనేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, నెల్లి వంశస్తులతో కలిసి పూజలు చేశారు. అక్కడి నుంచి ఉద్దాల ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. ముత్యాల పల్లకీలో దళిత పూజారులు ఉద్దాలు తీసుకురాగా.. భక్తులు దర్శించుకొని పునీతులయ్యారు. వివిధ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ఉద్దాలకు పూజలు చేశారు. వాగులో నుంచి తరలిస్తుండగా భక్తులు చాట కింద దూరి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్‌పై అప్పంపల్లి, తిరుమలాపూర్ మీదుగా కురుమూర్తి స్వామి ఆలయ వద్ద ఉన్న మండపం వద్దకు చేరింది. ఆలయం వద్ద ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తీసుకొచ్చి ఉద్దాల మైదానంలో ప్రదక్షిణలు చేసిన అనంతరం ఉద్దాలను స్వామి గర్భగుడి ఎదుట పూజలు చేశాక మంటపం వద్దకు తీసుకెళ్లారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో పటాకుల మోత మార్మోగింది. వేడుకను చూడడానికి దాదాపు రెండు లక్షల మంది భక్తులు తరలివచ్చారు. మహిళలు నియమనిష్టలతో వంటలు వండి స్వామికి దాసంగాలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

### నిరంతరం పర్యవేక్షణ

ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలకు జరగకుండా కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. ఆలయ పాలక మండలి సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూశారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టారు. పుష్కరిణీలో స్నానాలకు ఇబ్బందులేకుండా చర్యలు తీసుకున్నారు.

### రెండు లక్షల మంది రాక..

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాలోత్సవానికి దాదాపు 2 లక్షలకుపైగానే జనం హాజరయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాతోపాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉద్దాల రోజు స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. దీంతో మోటర్ సైకిల్స్, ఆటోలు, కార్లు, జీపులు, ఎడ్ల బండ్లు, బస్సులు, గూడ్స్ వాహనాలు.. ఇలా ఎవరి స్థాయికి తగ్గట్లు వారు సప్తగిరులకు చేరారు. ఇసుకేస్తే రాలనంత జనం రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. భక్తులు ఉదయం 7 గంటల నుంచే స్వామిని దర్శించుకునేందుకు బారులుదీరారు. కురుమూర్తి రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన క్యూ లైన్ నుంచి గుట్టపై ఉన్న కాంచన గుహలోని స్వామి దర్శనం వరకు భారీ క్యూలైన్ ఏర్పాటు చేశారు.


ఉద్దాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు


కురుమూర్తి సన్నిధికి ఎడ్లబండ్లపై చేరుకుంటున్న భక్తులు

# మైనర్ మృతికి కారకులను అరెస్ట్ చేయాలి


గద్వాల జిల్లా కేంద్రంలో ఆందోళన చేస్తున్న అఖిల పక్షం నాయకులు

- అఖిల పక్షం నాయకుల డిమాండ్

గద్వాల, నవంబర్ 8 : మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన మైనర్ వడ్డె రాజేశ్వరి మృతికి కారకులను వెంటనే అరెస్ట్ చేయాలని అఖిల పక్షం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు వెంకటస్వామి, ఆంజనేయులు, జ్యోతి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు మాట్లాడారు. మైనర్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోకుండా పోలీసులు కాలయాపన చేయడంపై వారు మండిపడ్డారు. పోలీసుల వైఖరి ఇలాగే ఉంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రాజశేఖర్‌రెడ్డిని అరెస్ట్ చేయకుండా.. న్యాయం కోసం ధర్నాలకు అనుమతులు అడిగితే ఇవ్వకుండా.. పరోక్షంగా నిందితులకు పోలీసులు సహకరిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ప్రజల కోసం కాకుండా నిందితుల పక్షాన నిలబడడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఆరు టీంలను ఏర్పాటు చేశామని చెబుతున్నా.. నేటికీ నిందితుల గురించి ఆచూకీ లభ్యం కాలేదంటే నమ్మశక్యంగా లేదన్నారు. జిల్లాలో జరిగిన అన్ని ఘటనలపై మానవ హక్కుల కమిషన్‌తోపాటు డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ధర్నాలో నాయకులు ప్రభాకర్, వినోద్, వాల్మీకి, సుభాన్, అరుణ, ప్రవీణ్, రాజేశ్వరి తల్లి కవిత, వడ్డెర సంఘం నేతలు ప్రకాశ్, ఆంజనేయులు, కుమార్, కిష్టన్న, రేణుక, ఆశన్న, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఈఎంటీలకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట, నవంబర్ 8 : ఈఎంఆర్ఐ (108) సంస్థలో ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం అధికారి రవికుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ (బీజెడ్‌సీ), బీఎస్సీ (నర్సింగ్), జీఎన్ఎం, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ, డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీ చదివిన వారు అర్హులని, 30 ఏండ్లలోపు వయస్సు ఉండాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని, ఈ నెల 11వ తేదీన నారాయణపేట డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉదయం 10 నుంచి 3 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్ తీసుకురావాలన్నారు. వివరాలకు 7981942670, 7702157040 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# నిలిచిన కొనుగోళ్లు

ధన్వాడ, నవంబర్ 8 : మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు నిలిచిపోయింది. మండల కేంద్రంలో సింగిల్ విండో కేంద్రంలో, గున్ముక్ల, మందిపల్లి ఐకేపీ కేంద్రా ల్లో కొనుగోలు జరగడం లేదు. రైతులకు ప్రభుత్వం ఇస్తున్న బోనస్‌పై రైతుల్లో అవగాహన లేకపోవడంతో నిలిచింది. కలెక్టర్, పౌరసరఫరాల అధికారి మండలంలో పర్యటించి రైతులకు బోనస్ అందిస్తామని హామీ ఇచ్చినా రైతులు ధాన్యం విక్రయించేందుకు ముందుకు రావడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో అధికారులు పొలం వద్దకే వచ్చి కొనుగోలు చేసేవారని పలువురు రైతులు గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్రానికే ధాన్యం తరలించి విక్రయించాలనే నిబంధన పెట్టడంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. బోనస్ వస్తుందా..? లేదా..? అన్న మీమాంస వారిలో నెలకొన్నది. వడ్లను ఆరబెట్టి విక్రయిస్తే తూకం తక్కువగా వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు తేమతో సంబంధం లేకుండా వరిని కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నారు. ప్రభుత్వం కూడా తేమతో సంబంధం లేకుండా వడ్లను కొనాలని కర్షకులు కోరుతున్నారు.


కొనుగోళ్లు నిలిచిపోవడంతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం

# సౌత్‌జోన్ ఖోఖోకు పీయూ జట్ల ఎంపిక


సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన ఖోఖో జట్ల క్రీడాకారులు


మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 8 : సౌత్ జోన్, ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు పాలమూరు యూనివర్సిటీ ఖోఖో (మహిళలు-పురుషులు) జట్ల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మనెమోని కృష్ణయ్య హాజరై క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. పోరాట పటిమ ఉంటేనే విజయం వరిస్తుందని సూచించారు. పురుషుల విభాగంలో ఎస్.అశోక్, ఎం.రాజు, ఎన్.పురుషోత్తం, పి.శివకుమార్, కే.శ్రీనివాసులు, ఎం.కేశవులు, ఎం.ప్రవీణ్, కే.శివకుమార్, ఎన్.భరత్, జీ.కమలాకర్, బీ.కళ్యాన్, టీ.చంద్రశేఖర్, పీ.నరేందర్, జే.వంశీ, జీ.భరత్‌కుమార్ ఎంపికయ్యారు. మహిళల విభాగంలో ఏ.అంకిత, జీ.రమ్య, జీ.నందిని, ఆర్.కవిత, కే.సౌజన్య, సీ.మమత, జీ.సోనాలిక, ఆర్.అంకిత, ఎస్.స్రవంతి, కే.గాయత్రి, జీ.శ్వేత, బీ.నికిత, కే.దీపికా, ఎం.కావ్య, జే.లింగమ్మ ఎంపికయ్యారు. వీరంతా తమిళనాడులోని కాళికాట్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొంటారని పీయూ పీడీ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమాల్లో ఖోఖో సెక్రటరీ విలియమ్స్, బాల్‌రాజు, పీయూ పీఆర్వో శేకుంటి రవికుమార్, ఎంవీఎస్ ఫిజికల్ డైరెక్టర్ సత్యభాస్కర్‌రెడ్డి, వెంకటేశ్, తిరుమలేశ్, మౌలాలి పాల్గొన్నారు.


పాఠశాల ఆవరణలోని నీటి ట్యాంకు

# జలం.. కలుషితం!

- నీటి ట్యాంక్‌లో కప్పలు, బొద్దింకలు
- పట్టించుకోని అడవి రావులచెర్వు పాఠశాల ఉపాధ్యాయులు

మల్దకల్, నవంబర్ 8 : మండలంలోని అడవి రావులచెర్వు పాఠశాలలో తాగునీరు కలుషితమవుతోంది. విద్యార్థులు తాగేందుకు ఏర్పాటు చేసిన మినీ ట్యాంక్‌లో కప్పలు, బొద్దింకలు, బల్లులు, క్రిమికీటకాలు చచ్చి పడి ఉన్నాయి. శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ట్యాంక్‌ను పరిశీలించగా.. అపరిశుభ్రంగా కనిపించింది. ట్యాంక్‌ను ఇలా ఉంచితే పిల్లలు నీళ్లు ఎలా తాగుతారని అక్కడి సిబ్బందిని వారు ప్రశ్నించారు. ట్యాంక్‌ను ఎందుకు పరిశుభ్రంగా ఉంచడం లేదని నిలదీశారు. మీ పిల్లలకు ఇలాంటి నీళ్లే తాగిస్తారా..? అని ప్రశ్నించారు. ఈ జలాలు తాగిన విద్యార్థులు అస్వస్థతకు గురైతే ఎవరు బాధ్యులు.. ఏదైనా జరగరానిది జరిగితే పరిస్థితి ఏమిటన్నారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంగా కారణం గా ట్యాంక్ గలీజ్‌గా మారిందని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించాలని కోరారు. ఎంఈవో సురేశ్‌ను వివరణ కోరగా.. సోషల్ మీడియాలో వార్త రావడంతో వెంటనే గ్రామానికి వెళ్లి పరిశీలించామని తెలిపారు. ట్యాంక్‌కు ఎలాంటి పైపులైన్ లేదని, నీళ్లు లీకేజీ కావడంతో నిల్వ ఉన్నాయని, ఈ నీటిని ఉపయోగించడం లేదన్నారు. కప్పలు ఉన్న ట్యాంకుకు ఎలాంటి పైపులైన్ లేదని, విద్యార్థులకు స్వచ్ఛమైన మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నట్లు చెప్పారు.


పాఠశాలలోని ట్యాంకులో మృతి చెందిన కప్ప